# అనాహూతం

ఆదివారం మీద అఖండమయిన ఆశ రంగారావుకి. ఏమాత్రం వొళ్ళువంచి చేయవలసిన పని వచ్చినా, మంచి పుస్తకం చదువుదామనుకున్నా, స్నేహితులకు, బంధువులకు ఉత్తరాలు వ్రాద్దాం అనుకున్నా, ఆ పనులన్నీ వచ్చే ఆదివారంనాడు తప్పకుండా చేస్తాను! – అని తనకు తాను చెప్పు కుంటాడు.

వారానికి ఒక్కమారు మాత్రమే వచ్చే 'ఆదివారం' అతన్ని ఎంత ఊరిస్తుందో అంత సునాయాసంగానూ చేతుల్లోంచి జారిపోతుంది. హాయిగా భోజనం చేసి సుఖంగా నిద్ర పోగలిగితే చాలు అని అనుకునే స్థితి కూడా వచ్చేసింది.

డాక్టర్ ఉష టరన్ డ్యూటి వుందంటూ వెళ్ళిపోవడంతో యింట్లో వొక్కడే మిగిలిపోయినాడు రంగారావు.

ఏమీ తోచదు. నిద్ర రాదు.

ఉష మూలమూలలా పడేసిన పాత పత్రికలు, మేగజైన్లు చదువుతూ కూచుందామనుకున్నా మనస్సు వాటిమీద నిలవడం లేదు.

రేడియో సంగీతం విందామంటే చాలా రోజులదాకా నిద్ర దూర మయిపోతుందేమోనని భయం.

ఫ్లాస్కులో దాచుకున్న కాఫీ గొంతు అరగా అరగా ఒక్కొక్క గుక్కే తాగేసి అయిపోయిందనిపించాడు.

సమయం ఎందుకు పరిగెత్తదు ? ఒక్కోమారు పట్టుకుందుకు కూడా చిక్కకుండా పరుగులు తీస్తుందే—అనుకున్నాడు.

ఒంటరితనంకన్నా భరించరానిది యింకేమీ లేదనిపించింది.

కాఫీ కావాలన్నా రెస్టరెంటుకు పరుగెత్తడం తప్ప యింకేం మార్గం లేదు.

ఆదివారం గడపడం యింత కష్టం అయినట్లు ఎక్కడా గుర్తులేదు.

అనుకున్న పనులు కాకపోగా, ఆలోచనలకు తుదీ మొదలు తెలియక పోగా, మనసెందుకో చీకాగ్గా విసుగ్గా తయారవుతోంది.

పక్కమీద దొర్లడం కూడా దుర్భరమయిపోతోంది.

కాస్త బయటకు వెళ్ళి నాలుగు బజార్లు చుట్టి రావాలనుకున్నా యిది సమయంకాని సమయం.

మధ్యాహ్నం రెండు గంటల వేళ షికారు యేమిటి?

అయినా యింట్లో నిలవకుండా వుంది మనస్సు, శరీరం.

మంచంమీద నుంచి దూకి యివతల పడ్డాడు.

దుస్తులు వేసుకు బయలుదేరాడు.

తాళం వేసుకుని స్కూటర్ బయట పెట్టింతర్వాత 'ఎక్కడికి ?' అన్న ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పవలసి వచ్చింది.

వాయిదా వేయడానికి వీల్లేని ప్రశ్న.

ముందు కాఫీ తాగుతాను. తర్వాత సినిమాకు వెడతాను అనుకున్నాడు.

ఏ సినిమా?

ఏదయినా సరే, ఏది దగ్గరగా వుంటే అదీ.

మంచి-చెడ్డ అన్న ప్రసక్తిలేదు. అన్ని సినిమాలూ రెండు రకాలవే.

రంగారావు లోపలకు వెళ్ళేటప్పటికి సినిమా యింకా ఆరంభం కాలేదు.

తన టిక్కెట్టుమీద వున్న నెంబరు చదువుకుని సరీగ్గా అదే నెంబరు యే కుర్చీమీద వేసివుందో వెదుక్కుని కూర్చున్నాడు....తరువాత యితరులతో పేచీ రాకుండా.

సినిమా చూస్తున్నాడన్న మాటే గాని అతనికి యేమీ అభిరుచిదాయకంగా అనిపించడం లేదు. ఇప్పుడిప్పుడే కాస్త నిద్ర వస్తున్నట్లుగా అనిపించింది. విసుగ్గా ఆవలించి—మత్తుగా ఇంటర్వెల్ దాకా గడిపేశాడు.

ఇంటర్వల్‌లో బయటకు వచ్చి కూల్ డ్రింక్స్ కార్నర్ వయిపు నడిచాడు.

ఏదో యెఱిగిన ముఖం.

చప్పున పేరు—ఊరు గుర్తురాని ముఖం.

ఆ మనిషి కూడా తన వయిపు యిదేమో స్తరు 'సంశయం'తో చూస్తున్నట్లు అనిపించింది.

అసహ్యం. ఎందుకు గుర్తురాడు యితను ?

అసలు తెలియనివాడు అయితే, ఎరిగి వున్న ముఖం ఎందుకు తగిలించుకున్నాడు ?

రోజులు గడుస్తున్నకొద్దీ తనకు వయస్సుతోపాటు 'మరుపు' కూడా వస్తోందన్నమాట.

రంగారావు గుటకలు మింగుతున్నాడు.

పిరికితనం, భయం అనిపించింది—అర్థం లేకుండానే.

ఆముదం తాగాడా తను ?

ఎందుకు సిగ్గుపడ్డట్టు ముఖం ఎర్రబారిపోతుంది ?

—ఎంతకూ అవతలి మనిషి గుర్తుకు రాడు.

అంతలో అతనే ముందుకు వచ్చి పరిచయంగా నవ్వి 'హల్లో రంగారావ్ ! క్షమించు....యిప్పటిక్కాని గుర్తు రాలేదు—' అన్నాడు.

రంగారావుకు బయటకు నవ్వక తప్పింది కాదు.

స్నేహితునితో షేక్‌హాండ్ చేశాడు.

తను యిందాకటి నుంచి పడుతున్న యాతనంతా అర్థరహితమయింది కాదన్నమాట !

రూఢిగా యితను తనకు పరిచయం వున్న వ్యక్తే.

అయితే—ఎక్కడ? ఎప్పుడు?

అదే తెలియదు, గుర్తు రాదు.

'నీకింకా గుర్తు రాలేదు గదూ? అవునులే. నాకే అంత టైం పట్టినప్పుడు .. అసలు నీకు గుర్తు వుండకపోయినా ఆశ్చర్యం లేదు.''

సన్నగా పొడుగ్గా చామనచాయగా స్నేహం చేయతగినివాడుగా కనిపిస్తున్న యీ పాత పరిచయస్తుడు ఎవరు?

'గుర్తు లేకపోవడం సహజమే. ఎన్నని గుర్తు పెట్టుకుంటాం జీవితంలో?'—

అన్నాడు ఆ మనిషి మళ్ళీ.

మామూలుగానేనా, వేళాకోళంగానా?

ముఖంలో మాత్రం 'సిన్సియారిటీ' ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

'నా పేరు రాజారావు. ఇంటర్‌లో మనమిద్దరం స్నేహితులం. అందరూ మనల్ని చూచి—''

రాజారావు వాక్యం పూర్తి చేయలేదు, ఆ అవసరం యివ్వకుండానే రంగారావు 'ఓరినీ! రాజా, నువ్వా! యిలా చిక్కిపోయావేం?' అంటూ దగ్గరకు తీసుకున్నాడు.

'ఒకప్పుడు మహా దున్నపోతులాగ వున్నానా యేమిటి? కాకపోతే యిక్కడకు వచ్చాక వళ్ళు తీసిందేమో!' అన్నాడు రాజారావు.

ఇద్దరికీ సినిమా చూడడం తప్పనిసరి కాదు.

ఇంటర్వల్‌లో 'స్కిప్' చేసినా సినిమావాళ్ళు యేకోపం చేయరు. చదువుకొనేటప్పుడు కాలేజీల్లో అలవాటే.

రాజారావు యేదో ప్రశ్నలు వేస్తున్నాడు.

రంగారావు యాంత్రికంగా జవాబులు చెబుతున్నాడు.

సమస్యలు, జాబితాలు, ఫిలాసఫీలు తొంగి చూస్తున్నాయి వాళ్ళ మాటల్లో.

తీరుబడిగా యింటిదగ్గర కూర్చుని మాట్లాడుకున్నారు. డాక్టర్ ఉష యింటికి తిరిగి వచ్చేదాకా ఎంత టైము ఎలా గడిచిపోయిందో యిద్దరికీ తెలియదు.

డాక్టరు ఉషను పరిచయం చేసింతర్వాత, ఆమె యింట్లోకి వెళ్ళి పోయి తన పనుల్లో మునిగిపోయేక రాజారావు సన్నగా అన్నాడు: 'నువ్వు చాలా గొప్ప పని చేశావు, అభిప్రాయాల కోసం బాధలు భరించేవాళ్ళు ఉంటారని ప్రపంచానికి చూపించావు. నీలాంటి స్నేహితుడు వుండడం గర్వకారణం.'

'అంత పొగడాల్సిన పని నేనేం చేశాన్లే నాకు తోచినట్లుగా నేను ప్రవర్తించాను.'

'నువ్వు చేసిన పని నీ దృష్టిలో చాలా కొద్దిదీ, యేమంత గొప్పదీ కాకపోవచ్చును. కాని అందరూ చేయలేరు ఆ పని.'

రంగారావు నవ్వాడు. 'నీలాంటివాడే ఒక కథ చెప్పాడు. నేను కళ్ళు మూసుకు చేసిన పని నీవు కళ్ళు తెరుచుకొని కూడా చేయలేవని. ఆ పనేమిటో తెలుసా యింతకీ! కళ్ళమీద ఇసుక పోసుకోవడం!'

రాజారావును యీ కథ నవ్వించలేదు. నిట్టూర్చి అన్నాడు, 'మామూలు కళ్ళు వుండేం, వుండకేం! మనసును ముఖాముఖీ చూచుకో గల కళ్ళు కావాలి!'

'మనో నేత్రానికి వ్యాఖ్యానం చెబుతున్నావు?'

'ఏం పోగొట్టుకుంటున్నామో తెలిస్తే, జీవితాలు యింత అధ్వాన్నంగా వుండవు.'

'పోదూ! జీవితం గురించి ఊరికే ఆలోచిస్తే యిలాగే అనిపిస్తుంది. అలా కాకుండా యే సమయానికి ఆ సమయం మనకు తోచిన పని యేమీ భయం, బెఱుకూ లేకుండా చేసుకు పోతూవుంటే యింకేం కావాలి?'

'అలా చేయటానికే గదూ ఎంతో ధైర్యం కావాలని చెబుతూ వున్నది.''

'చేయాలనుకుంటే ధైర్యం అదే వస్తుంది.'

'అదే నాకు అర్థం కాదు.'

'రాజా! జీవితం ఎప్పుడూ నిన్ను ఊరించే తినుబండారం లాంటిది. అది కావాలనుకొంటే యింకేదో వొదులుకోవాలి. బాగున్న వస్తువు ఎక్కువ తింటే అజీర్తి చేయకుండా పోతుందా?'

'వొదులుకోవటానికి—రెంటికి వున్న వ్యత్యాసం మనస్సుకు స్పష్టంగా తెలియాలిగదా?'

'అదే మన చదువు సంస్కారం మనకు నేర్పేది.'

'అందుకనే నిన్ను మెచ్చుకొనేది. అందరం చదువుకున్నాం. సంస్కారవంతులం అనుకుంటున్నాం. నువ్వు చేసినపని అందరూ ధైర్యంగా చేయగలరా?'

'అందరికీ అలా చేయాల్సిన అవసరం రావాలిగా?'

'వస్తే చేస్తారంటావా?'

'అది ఎవరికి వాళ్ళు ఆలోచించి జవాబు చెప్పుకోవలసిన ప్రశ్న.'

'నాకు నేను ... చేయలేకపోయినాను. అందువల్ల జీవితం పాడయిపోలేదనుకో! అయినా ఆ విషయం తలుచుకున్నప్పుడు నా పిరికితనానికి నాకు సిగ్గు అనిపిస్తుంది'

'యేం చేశావు? — అదే యేం చేయలేకపోయావు? అని అడుగుతున్నాను.'

'నేనూ అనుకొన్న అమ్మాయిని పెళ్ళి చేసుకోలేకపోయినాను. నీలాగ తల్లినీ తండ్రినీ దూరం చేసుకోవలసిన పరిస్థితిగూడా కాదు నాది. అయినా ధైర్యంగా నాలుగు మాటలు గట్టిగా అనలేకపోయినాను.'

'పోనీలే. అందువల్ల నష్టం యేం జరగలేదంటున్నావుగా!'

'నష్టం - లాభం అంటూ బేరీజు వేసుకుందుకు జీవితం వ్యాపారం కాదుగా రంగారావు. నా కథ వింటే నువ్వు నవ్వుతావు. నాకు ఏడుపు వస్తుంది.' అన్నాడు రాజారావు.

ఏదో 'సెల్ఫ్‌పిటీ' కలిగించే కథ, అంతకంటే యింకేం కాదు— అనుకొన్నాడు రంగారావు.

డాక్టరు ఉష చేతిమీదుగా భోజనం చేసి యిద్దరూ డాబా మీదకు చేరారు. తొమ్మిది గంటలయింది, వాతావరణం శీతలంగా వుంది. ఇద్దరి మనస్సులూ పరిశుభ్రంగా వున్నాయి. హిమగిరి శిఖరాల మీద విచ్చలవిడిగా తిరుగుతున్నట్లు వున్నాయి.

రాజారావు చెప్పుకుపోతున్నాడు:

"నాకో మేనమామ. ఆ మామకో కూతురు. ఆ పిల్ల పేరు విజయ. ఆమె పుట్టిందగ్గర్నుంచీ నాకు 'పెళ్ళాం' అని పేరు పెట్టారు.

'మా కిద్దరికి కూడా యిష్టమే. స్నేహంగా వుండేవాళ్ళం.

'నేను ఎం. ఎ. ఫైనల్ పరీక్ష యింకో రెండు నెలల్లో రాస్తాననగా మేనమామ అకస్మాత్తుగా ఊడిపడ్డాడు.

'విజయను నీకు యివ్వనంటాడా?'

'కాదు. పై నెలలోనే పెళ్ళి చేసి తీరాలంటాడు.'

'ఏమిటంత అర్జెంటు?'

'ఇప్పుడు ఆలోచిస్తే ఎగతాళిగా వుంటుంది గాని, అప్పుడు మా మామయ్య చెప్పిన విషయం మటుకు యిది; ఎవరో జ్యోతిష్కుడు -

అయన వాక్కుకు గ్రహాలు కూడా హడలిపోతాయట! - చెప్పిన ప్రకారం మా మామయ్య యింకా బతికుండేది రెండే రెండు నెలలు. ఈ లోపల తన పనులన్నీ పూర్తి చేసుకోవాలని తీర్మానం చేసుకొన్నాడు. ఆ పనుల్లో ముఖ్యమయింది విజయ పెళ్ళి చేసేయడం.'

'మరింకేం, నీకూ యిష్టమేనంటివిగా-చేసేసుకొంటే పోలా?'

'అదే చిక్కు.. మా మామయ్య ఎంత చాదస్తుడో, మా నాన్న అంత మొండివాడు. అమ్మకూ యిష్టం. అయినా మామయ్య తొందరపెట్టడం నచ్చ లేదు. ఇద్దరూ తేల్చిన విషయం ఏమిటంటే—నీ ఆరోగ్యానికి వచ్చిన పేచీ యేం లేదు. ఒకవేళ యేదైనా ప్రమాదం తటస్థించినా, విజయను మా కోడలు చేసుకుంటామని నీకు యిదే మాట యిస్తున్నాం. తిరుగు లేదు. కాని యిప్పుడు పరీక్షల ముందు నెలరోజులలో ఆత్రపడిపోయి వాడికి వివాహం చేసి వాడి దృష్టి మళ్ళించి, పరీక్షల్లో మంచి మార్కులు రాకుండా—ముందు ముందు మంచి ఉద్యోగానికి అవకాశం లేకుండా చేయడం మాత్రం మావల్ల కాదు—అని.'

'భళేవాళ్ళే, యిద్దరికి యిద్దరూ!'

'అందరికీ యిష్టం అయినపయినా యెలా తప్పిపోతుందో చూడు. నన్ను ఎవరూ సంప్రదించనుకూడా లేదు. మామయ్య మాత్రం తన కళ్ళ మీదుగా—చేతులమీదుగా విజయ వివాహం జరగాలని, తను అనుకున్న గడువులోనే నాకంటే అన్నిరకాల అర్హుడయిన అల్లుడిని వెదుక్కున్నాడు. విజయ యేమనుకుందో తెలియదుగాని నాకు యీ సంగతి తెలిశాక పైకి యేడవలేక, లోపల కుక్కుకు వుండలేక ఒకటే సతమతం అయిపోయినాను ఆరునెలలపాటు.'

'పోనీలే. ఇప్పటికయినా కుదుటపడ్డావుకదా! విజయ, భర్త కులా సాగా వున్నారా?'

'ఆహా! వాళ్ళ సంగతి వదిలెయ్యి. మా మామయ్య యిప్పటికి నవ రత్న ఖచితంగా వున్నాడు. మూర్ఖానికి పోయి అయిన సంబంధం కాకుండా చేశాడని అమ్మకి నాన్నకి మామయ్యమీద ఒకటే కోపం. మామయ్య మాత్రం వేదాంతిలాగ సన్యాసిలాగ చేతులు ఆకాశం వేపు చూసి 'అంతా పరమాత్ముడి సంకల్పం' అంటాడు.'

'విజయను చూచావా ఎప్పుడయినా తరువాత?' అని అడిగాడు రంగారావు.

'ఆ! నేను పెళ్ళి చేసుకోవలసిన విజయ నా పెళ్ళికి పిల్లవాడిని ఎత్తుకుని మరీ వచ్చింది. అప్పటికే దానికి యిద్దరు పిల్లలు! విజయ ముఖం లోకి సూటిగా చూడడం నాకు చేతకాలేదు, విజయకూ అంతే! మా యిద్దరి మధ్యా యీ ప్రస్తావన రాలేదు మాటమాత్రంగా నయినా.'

రంగారావు ఏమీ మాట్లాడలేదు.

'నాతో ఎవరూ ప్రస్తావించకపోయినా, నేను ధైర్యంగా నాలుగు మాటలు మాట్లాడగలిగి వుంటే, నా జీవితం యిలా అయేదంటావా?'

'ఇప్పుడు మీ జీవితానికి వచ్చిన లోటు ఏమిటి? మీ దారిని మీరు, విజయపాటికి విజయ ఎవరి సంసారం వాళ్ళు సజావుగా చేసుకుంటున్నారు గదా!' అంది డాక్టర్ ఉష మెట్లమీదనుంచి.

ఆమె అక్కడే కూర్చుని తన కథనం అంతా వింటూందని అప్పుడే తెలుసుకుని ఉలిక్కిపడ్డాడు రాజారావు.

'ఏమీ మునిగిపోయింది లేదనుకోండి. కాని చిన్నతనంనుంచి అనుకున్న సంబంధం చేసుకోలేకపోవడం....మా మామయ్య చాదస్తం వల్ల నా చేతకానితనం వల్ల....' అంటూ మాటలు పూర్తిగా బయటకు అనలేక ఊరుకుండిపోయాడు.

'ఇందులో చాదస్తం లేదు, చేతకానితనం లేదు. మీ కిద్దరికీ 'ఘటన' లేదు అంతే. మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ గదా!' అన్నాడు రంగారావు.

'అలా అనుకోవడం తప్పించుకోవడంకాదా? జీవితాన్ని సమరసంగా దిద్దుకోలేక పక్కకు తప్పుకు తిరగాలనుకోవడంకాదా ?'

'విజయ అంటే కాకినాడలో సుబ్రహ్మణ్యంగారి అమ్మాయేనా?' అనడిగింది ఆమె.

'అవును. మీరు యెరుగుదురా ? సుబ్రహ్మణ్యమే మా మేనమామ' అన్నాడు రాజారావు డాక్టర్ ఉషవయిపు ఆశ్చర్యంగా చూస్తూ.

'ఉష కొన్నాళ్ళు కాకినాడలో ఉద్యోగం చేసిందిలే-' అన్నాడు రంగారావు.

'విజయ మీకు తెలుసాండీ?' అని అడిగాడు రాజారావు ఎంతో ఉత్సాహంగా, ఆసక్తిగా.

'అబ్బే తెలీదండీ. కేవలం ముఖపరిచయం. అంతే' అంది చటుక్కున డాక్టర్ ఉష.

విజయ తండ్రి ఆమెకు అంత అర్జెంటుగా ఒక నెల రోజులలోనే ఎందుకు వివాహం చేయవలసి వచ్చిందో గుర్తుకు వచ్చి డాక్టర్ ఉష పెదవులమీద చిన్న మందహాసం విరిసింది.

ఆకాశంలో అప్పుడే మెరిసిన మెరుపుకు రంగారావు ఆమెను గమనించాడు గాని, రాజారావు మాత్రం యింకా ఆలోచనలోనే కూరుకుపోయి వున్నాడు.

*

(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక)

కథా నిలయం
3871
శ్రీకాకుళం